క్లుప్తంగా

జైన్ సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

కాచిగూడ: బర్కత్‌పుర, భూమన్నలేన్‌లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీజైన్ శ్వేతాంబర్ తపగచ్చి సంఘం భవన నిర్మాణపు పనులను సోమవారం కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి భూమిపూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, ఎ.సూర్యప్రకాష్ సింగ్, బండారు సంతోష్, బి.భీమ్‌రాజ్, ఎస్. రవియాదవ్, ఎస్.అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల చింపివేతపై పోలీసులకు ఫిర్యాదు

అంబర్‌పేట: బీఆర్‌ఎస్ అంబర్‌పేట నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ ఎడ్ల సుధాకర్ రెడ్డి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు చింపివేయడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చింపి వేయడంతో ఆయన సోమవారం అంబర్‌పేట, నల్లకుంట, కాచిగూడ పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు నమోదైంది. అనంతరం నగర పోలీస్ కమిషనర్ సీవీ.ఆనంద్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఫ్లెక్సీలను చింపిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు.

తొలితరం సాహితీ కళాకారుడు కేశవదాసు

చిక్కడపల్లి: కొత్తగూడెం ప్రాంతంలోని పల్లెలో పుట్టిన చందాల కేశవదాసు తెలుగునాట సాహితీ సినీనాటక రంగాల్లో ఎదిగిన తొలితరం కళాకారుడు అని బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవిప్రసాద్ అన్నారు. త్యాగరాయగానసభలో కళాసుబ్బారావు కళావేదికలో చందాల కేశవదాసు సంస్మరణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా దేవిప్రసాద్ హాజరై మాట్లాడారు. సాహితీవేత్త తంగిరాల చక్రవర్తి, గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, కొల్లి నాగేశ్వర్ రావు, చక్రపాణి పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

ముషీరాబాద్: క్రీడలు మానసిక ఉల్లాసం, శారీరక ధారుడ్యానికి దోహదం చేస్తాయని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సోమవారం ముషీరాబాద్‌లోని తొక్వాండో అకాడమీ, షాడో వారియర్స్ అకాడమీ సంయుక్తాధ్వర్యంలో తొక్వాండాలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బ్లాక్ బెల్ట్, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే క్రీడాకారులను అభినందించి మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పూస గోరఖ్‌నాథ్, తొక్వాండో అకాడమీ సంస్థ చైర్మన్ అశ్రఫ్, ప్రతినిధులు మధులత, రమణ, విక్టర్ తదితరులున్నారు.

పరకాల లలితమ్మకు నివాళి



నివాళులర్పిస్తున్న భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత

ముషీరాబాద్: భారత జాగృతి ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ పరకాల మనోజ్‌కు మార్‌గౌడ్ మాతృమూర్తి పరకాల లలితమ్మ మే 29న మరణించారు. విషయం తెలుసుకున్న భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాంనగర్ డివిజన్ దాయరా మార్కెట్‌లోని ఆయన నివాసానికి ఎమ్మెల్సీ సోమవా రం లలితమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ రాజీవ్‌సాగర్, బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహ, రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్, కార్మిక నాయకుడు వి.శ్రీనివాస్‌రెడ్డి, జాగృతి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచార్య, గ్రేటర్ కన్వీనర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలి

కాచిగూడ: కేంద్రంలోని వివిధ ప్రభుత్వశాఖల్లో ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే కోటి ఉద్యోగాలను కల్పిస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. కేంద్రంలో 20 లక్షలకు పైగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయకుంటే కేంద్రానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత !



ర్యాలీలో పాల్గొన్న ఏఎంహెచ్‌ఓ డాక్టర్ జ్యోతిబాయి, ఎన్‌సీఏ ప్రతినిధులు



సుందరయ్యపార్కులో మొక్కలను నాటుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

అంబర్‌పేట: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని బాగ్ అంబర్‌పేట్ కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా డివిజన్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రతిజ్ఞ చేయించారు.

- అంబర్‌పేట డివిజన్‌లో కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రేమ్‌నగర్‌లో ఉన్న బస్తీ దవాఖానా ఆవరణలో మొక్కలు నాటారు.

నల్లకుంట సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ (ఎన్‌సీఏ) ఆధ్వర్యంలో..

నల్లకుంట: ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణం పెను ప్రమాదంలో పడతుందని జీహెచ్‌ఎంసీ సర్కిల్ - 16 ఏఎంహెచ్‌ఓ డాక్టర్ జ్యోతిబాయి అన్నారు. ఉష్ణ తాపం పెరిగి వాతావరణ కాలుష్యంతోపాటు ప్రాణాంతక వ్యాధులు వస్తాయన్నారు. సోమవారం నల్లకుంట సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ (ఎన్‌సీఏ) ఆధ్వర్యంలో 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని పారదోలుదాం – పర్యావరణాన్ని కాపాడుకుందాం' అనే నినాదంతో శంకరమఠం కూరగాయల మార్కెట్ రోడ్డులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. దీనికి హాజరైన ఏఎంహెచ్‌ఓ ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. సామాజికవేత్త రాజీవ్, ఎన్‌సీఏ అధ్యక్షుడు మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి మోహన్‌నాయుడు, ప్రతినిధులు శ్రీనాథ్, రమేష్‌నాయుడు, రితేష్, జయచంద్ర, వినోద్‌నాయుడు, శ్రీనివాసరావు, అశ్విన్, కిషన్‌రావు, వీరయ్య, వెంకటస్వామి, శంకరం, కృష్ణబాబు, రామ్‌కుమార్, శివకుమార్, రమణ, జయచంద్ర, సుశాంత్, జయంత్‌రెడ్డి తదితరులున్నారు.



మాట్లాడుతున్న ప్రముఖ సైంటిస్టు బాబురావు

మొక్కలు నాటిన ఎమ్మెల్యే..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సోమవారం సుందరయ్య పార్కులో పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే మొక్కలు నాటారు. చెట్లు ప్రగతికి మెట్లు అని అందుకే ప్రతి ఒక్కరూ బాధ్యతగా నాటిన మొక్కలను పరిరక్షించడానికి కృషి చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఆర్.మోజెస్, ప్రధాన కార్యదర్శి మన్నె దామోదర్‌రెడ్డి, పార్కు అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, సీనియర్ ఉపాధ్యక్షులు బబ్లూ, ప్రభాకర్, శివయాదవ్, శ్రీను, రాకేష్, వెంకటస్వామిగౌడ్ తదితరులున్నారు.

- మానవుడి మనుగడకు పర్యావరణ పరిరక్షణే చక్కటి మార్గమని సైంటిస్టు బాబురావు అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హైదరాబాద్ శాంతి సంఘీభావం ఆధ్వర్యంలో 'పర్యావరణ పరిరక్షణ' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న బాబురావు మాట్లాడుతూ.. అనేక రకాల కాలుష్యం వల్ల పర్యావరణం ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కె.యాదవరెడ్డి, జి.నాగేశ్వర్‌రావు, రామరాజు, సరస్వతి, శ్రీనివాస్, డాక్టర్ సమత, మజీద్, రఘుపాల్ తదితరులున్నారు.

భవిష్యత్తు తరాల కోసం..

కాచిగూడ: భావితరాలకు కాలుష్యరహిత పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని రైల్వే సీఎంఎస్ డాక్టర్ అనురాధ అన్నారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కాచిగూడ రైల్వే స్టేషన్ వద్ద రైల్వే అధికారులు, సిబ్బంది పర్యావరణంపై అవగాహన కల్పించారు.



కాచిగూడ రైల్వేస్టేషన్ వద్ద అవగాహన కల్పిస్తున్న రైల్వే అధికారులు



ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది, కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి



ప్రతిజ్ఞ చేయిస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

రేషన్‌షాపుల్లో 12 రకాల నిత్యావసర సరుకులు ఇవ్వాలి

ముషీరాబాద్: ప్రభుత్వం రేషన్‌షాపుల ద్వారా 12 రకాల నిత్యావసర సరుకులు ఇవ్వాలని ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కాశీనాథ్, కే.ఎస్.ప్రదీప్‌లు డిమాండ్ చేశారు. సోమవారం విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో పలు నిర్ణయాలు, తీర్మానాలు చేశారు. జూన్ 19న రాష్ట్రవ్యాప్తంగా 12 రకాల నిత్యావసర సరుకులను రేషన్‌షాపుల ద్వారా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. తహసీల్దార్ కార్యాలయాలను పీడీఎస్‌యూ సంఘంతో కలిసి ముట్టడించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. చౌక ధరలకు నిత్యావసర సరుకులు గతంలో పేదలకు అందించగా.. నేడు వాటిని రద్దుచేసి ధరలు విపరీతంగా పెంచారని విమర్శించారు. రేషన్ డీలర్లు తమ న్యాయమైన డిమాండ్ల సాధనకోసం చేస్తున్న సమ్మెకు పూర్తి సంఘీభావాన్ని ప్రకటించారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి రాకేష్, కోశాధికారి ఈశ్వర్, నాయకులు భూషణవేణికృష్ణ, బుచ్చిరాజు, యాకయ్య, వినోద్ తదితరులున్నారు.

రేషన్ డీలర్ల కమీషన్ పెంచాలి..

ముషీరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ రేషన్ డీలర్లకు ప్రభుత్వం రేషన్ బియ్యంపై ఇస్తున్న క్వింటాల్‌కు రూ.70 కమిషన్‌ను రూ.250 లకు పెంచాలని గౌరవ వేతనం ఇవ్వాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు కాచం కృష్ణమూర్తి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేషన్ డీలర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ డీలర్ల జేఏసీ ఇచ్చిన సమ్మె, రేషన్ షాపుల బంద్ పిలుపుకు మద్దతుగా సివిల్ సప్లై సర్కిల్ -6 రేషన్ డీలర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రాంనగర్‌లోని ఎస్సార్టీ కమ్యూనిటీహాల్‌లో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వాడకట్ల రాజు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణమూర్తి మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో రేషన్ డీలర్లకు అన్ని ప్రభుత్వాలు రూ. 200-250 రూపాయల కమిషన్ క్వింటాల్‌కు ఇస్తుందని రాష్ట్ర ప్రభుత్వం 9 ఏళ్లుగా పాత పద్ధతిలోనే రూ. 70 ఇస్తుందన్నారు. ప్రతి డీలర్ వంద క్వింటాలు అమ్మితే కేవలం రూ. 7000ల కమీషన్ మాత్రమే వస్తుందన్నారు. వీటిలో షాపు అద్దె ఎలా చెల్లించాలని, హెల్పర్‌కు జీతం ఎలా ఇవ్వాలని, రేషన్ డీలర్ల కుటుంబం ఆ డబ్బులతో ఎలా బతుకుతుందో ప్రభుత్వం ఆలోచించాలని సూచించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వాడకట్ల రాజు, శ్రీరాములు, మోహిన్, మహేందర్‌రాజు, నాయకులు ఎర్రం శ్రీనివాస్ గుప్తా, గజ్జెల సూర్యనారాయణ, కె.నందు, ప్రసాద్, పరిమళ్‌కుమార్, భువనగిరి నవీన్, మధుతో పాటు రేషన్‌డీలర్లు పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

కవాడిగూడ: బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్, న్యాయమైన సమస్యలకు వెంటనే పరిష్కరించాలని ఆలిండియా బ్యాంక్ పెన్షనర్స్ రిటైరీస్ కాన్ఫడరేషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం ఇందిరాపార్కు ధర్నాలో ఆలిండియా బ్యాంక్ పెన్షనర్స్, రిటైరీస్ కాన్ఫడరేషన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాన్ఫెడరేషన్ తెలంగాణ, ఏపీ ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్, కాన్ఫడరేషన్ ఉపాధ్యక్షులు కె.సూర్యనారాయణమూర్తి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కె.సురేష్‌బాబు, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ ఉప్పు సుధాకర్, నేతలు నాగేశ్వర్, జోష్ఫ్యలు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న బ్యాంక్ రిటైరీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యలు డిమాండ్లను పరిష్కరించకుంటే ఆందోళన కొనసాగిస్తామని వారు హెచ్చరించారు. హైదరాబాద్, సికింద్రాబాద్‌లోని దాదాపు 20 బ్యాంకుల నుంచి సుమారు 500 మంది బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.



ధర్నాలో కాన్ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు కె.సూర్యనారాయణమూర్తి

ప్రభుత్వం 24 గంటల విద్యుత్‌ను అందిస్తోంది

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గృహ, వాణిజ్య, పరిశ్రమలు, సహా అన్ని రంగాలకు నిరంతరం 24 గంటల విద్యుత్ సరఫరాను అందించడం జరుగుతుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వ్యవసాయ రంగానికి నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను అందిస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ముషీరాబాద్ నియోజకవర్గం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా విద్యుత్ విజయోత్సవ సభను నిర్వహించారు. డీఈ వెంకటరావు, ఏడీఈలు పాపయ్య, నవనీత, ముఠా జైసింహ, పెంటారెడ్డి పాల్గొన్నారు.

సేవాగుణాన్ని అలవర్చుకోవాలి

చిక్కడపల్లి: ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా జన్మదినం సందర్భంగా సోమవారం చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. పార్టీ యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహ, సంఘ అధ్యక్షుడు సింగారపు రమేశ్‌గుప్తా, లక్ష్మణ్, శ్రీనివాస్, బాలకుమార్, రవీందర్, శ్రీనివాస్, రమేష్, శ్రీరామ్, నగేష్, బీఆర్‌ఎస్ నాయకులు రాకేష్, శ్రీనివాస్‌గుప్తా, రవిశంకర్‌గుప్తా, శ్రీధర్‌రెడ్డి, తదితరులున్నారు.

అన్నదానం..

కాచిగూడ: పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ కొల్లేటి దామోదర్ గుప్తా పుట్టినరోజు సందర్భంగా సోమవారం వీబీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రాంతాల్లో రైల్వే స్టేషన్లు, బస్టాప్‌లు, ఆసుపత్రులు, పేద ప్రజలకు ఆసుపత్రికి వచ్చిన రోగుల సహాయకులకు అన్నదానం నిర్వహించారు. రోజారమణి, వీబీజీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మడిపడిగ రాజు, రామసత్యనారాయణ, సంజయ్, సత్యవతి ప్రసన్న తదితరులు పాల్గొని అన్నదానం చేశారు. పబ్బతి రవికుమార్, బండారు సుబ్బారావులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.



దశాబ్ది ఉత్సవాలకు తలసాని

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలోని ఆర్టీసీ కల్యాణ మండపం ఎదురుగా వీఎస్‌టీ వర్కర్స్ యూనియన్‌హాల్‌లో ఈరోజు తెలంగాణ ఇండస్ట్రియల్ గ్రోత్ ఫెస్టివల్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నారు. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, అధికారులు పాల్గొననున్నారు.

జైస్వాల్ కులస్తులకు సంక్షేమ భవనం నిర్మించాలి

కాచిగూడ: రాష్ట్రంలోని జైస్వాల్ కులస్తులకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ భవనాన్ని నిర్మించాలని కల్వర్ జైస్వాల్ సభ విజ్ఞప్తి చేసింది. ఉప్పల్ బగాయత్‌లో ఐదు ఎకరాల స్థలం, రూ.5 కోట్ల నిధులు కేటాయించాలని కల్వర్ జైస్వాల్ సభ ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. జైస్వాల్ కులస్తులను బీసీ బీ జాబితాలో చేర్చాలని, కుల ధ్రువీకరణ పత్రాలు జారీచేసేలా మండల తహసీల్దార్లకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కాచిగూడలోని మున్నూరుకాపు భవన్, మ్యాడం అంజయ్య హాల్‌లో కల్వర్ జైస్వాల్ సభ ఆధ్వర్యంలో శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎస్ ఎస్‌కే జైస్వాల్, కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్, కల్వర్ జైస్వాల్ సభ జాతీయ అధ్యక్షుడు అశోక్ జైస్వాల్, రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ జైస్వాల్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

'ప్రవాస భారతీయులు మార్పు కోరుకుంటున్నారు'

కాచిగూడ: విభజన రాజకీయాలు, మత విద్వేషాలతో నిరంకుశంగా పాలనా కొనసాగిస్తూ కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం శాంతి, సామరస్య దేశంగా ఉన్న భారత్ ప్రతిష్టను దెబ్బతీస్తుందని, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించి మార్పు తీసుకువచ్చి 'నిజమైన ప్రజాస్వామ్యాన్ని' పునరుద్ధరించాలని అమెరికా లోని ప్రవాస భారతీయులు కోరుకుంటున్నారని టీపీసీసీ ప్రధానకార్యదర్శి డాక్టర్ కోట నీలిమ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వేచ్ఛపై దృష్టి సారించి నిజమైన ప్రజాస్వామ్యం యొక్క భాగస్వామ్య విలువలు, దృక్పథాన్ని ప్రోత్సహించడానికి కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, మాజీ ఎంపీ రాహుల్ గాంధీతో పాటు అమెరికాలో పర్యటిస్తున్న డాక్టర్ కోట నీలిమ అమెరికన్ చట్టసభ సభ్యులను, భారతీయ ప్రవాసులతో సహా వివిధ వ్యక్తులు, సంస్థలు, మీడియాతో సమావేశమైనట్లు ఆమె తెలిపారు.

మహిళ అదృశ్యం



సునీత (ఫైల్)

చిక్కడపల్లి: బ్యాంకుకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దోమలగూడ పోలీస్‌స్టేషన్ ఎస్సై కె.శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బండానగర్‌లో నివసించే కె.సునీత (40) కొన్నేళ్ల క్రితం భర్త చనిపోయాడు. గత నెల 31న బ్యాంకుకు వెళ్తున్నానని చెప్పి మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో సునీత బ్యాంకుకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం చుట్టు పక్క ప్రాంతాలు బంధువులు, స్నేహితుల ఇళ్లలో వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రణాళికతో నియోజకవర్గ అభివృద్ధి



సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట: నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళికతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ఎమ్మెల్యే నిధులతో డ్రైనేజీ, వాటర్ పైపులైన్లు, సీసీ రోడ్లు, కమ్యూనిటీహాళ్ల నిర్మాణం, పార్కుల సుందరీకరణ పనులను చేపడుతున్నామన్నారు. నల్లకుంట డివిజన్ సత్యానగర్‌లో రూ.20 లక్షలతో నూతనంగా చేపట్టనున్న సీసీరోడ్డు పనులకు సోమవారం స్థానిక కార్పొరేటర్ అమృతతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సత్యానగర్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానన్నారు. బస్తీలో అవసరమైన చోట తాగునీరు, డ్రైనేజీ పైపుల నిర్మాణపనులు పూర్తి చేయించామన్నారు. నల్లకుంట డివిజన్‌లో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే వివరించారు. వర్షాకాలంలో బస్తీని ఆనుకుని ఉన్న రేల్వే ప్రహరీలేన్ ప్రాంతంలో ముంపు సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు చేపట్టేలా జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించామన్నారు.



అమ్మవారి దర్శనం



చండీహోమం, పూర్ణాహుతి కావిస్తున్న అర్చక స్వాములు



కైలాస గౌరీపూజలో మహిళలు



కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ దంపతులు

అమ్మవారికి ప్రత్యేక పూజలు

నల్లకుంట: మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని న్యూ నల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి దేవాలయం భక్తులతో పోటెత్తింది. ఈ సందర్భంగా సోమవారం ఉదయం సరస్వతిమాతకు అభిషేకం నిర్వహించి పట్టువస్త్రాలు, పూలమాలలతో అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో అర్చక స్వాముల మంత్రోచ్చరణల మధ్య చండీహోమం చేపట్టారు. నవధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు, అమ్మవారికి సమర్పించారు. నూతన వస్త్రాలు, కొబ్బరి కాయలు హోమంలో వేసి ఆవు నెయ్యితో పూర్ణాహుతి కావించారు. భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ జరిగింది.

భక్తి శ్రద్ధలతో కైలాస గౌరీ నోము..

బ్రాహ్మణ మహిళాసంఘం ఆధ్వర్యంలో సోమవారం న్యూ నల్లకుంటలోని కొత్త రామాలయం ప్రాంగణంలో కైలాస గౌరీ నోము, లక్ష పసుపు కొమ్ముల నోము భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరీమాతను పట్టువస్త్రాలు, పూలమాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కైలాస గౌరీనోము చేయడం ద్వారా భర్త ప్రేమను సంపూర్ణంగా పొందవచ్చని పురాణాలు చెబుతున్నాయని అందుకే మహిళలు భక్తిశ్రద్ధలతో కైలాస గౌరీనోము నిర్వహిస్తారన్నారు. సూర్యకుమారి, మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో అన్నపూర్ణ, నిర్మల, రేణుక, జ్యోతి, భార్గవి, ప్రసూన, లలితాకుమారితో పాటు మహిళలు పాల్గొన్నారు.

దుర్గాదేవి ఆలయంలో కార్పొరేటర్ దంపతులు..

చిక్కడపల్లి: బ్యాంక్ ఆఫ్ బరోడా కాలనీలో ప్రసిద్ధి చెందిన 70ఏళ్ల చరిత్ర కలిగిన దేవీచౌక్ ప్రసిద్ధ దుర్గాదేవి ఆలయపునర్నిర్మాణం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ దంపతులు ఎ.పావనీవినయ్‌కుమార్‌లు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు డి.రాజు ఆధ్వర్యంలో కార్పొరేటర్ దంపతులను సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.

విస్తృతంగా సేవా కార్యక్రమాలు



మాట్లాడుతున్న సురేష్ చందర్‌రావు

నల్లకుంట: తెలంగాణ బ్రాహ్మణ సేవా సంస్థ (టీబీఎస్‌ఎస్) ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సురేష్ చందర్‌రావు, కుల్వంతరావు పిలుపునిచ్చారు. సోమవారం న్యూనల్లకుంటలోని బ్రాహ్మణ హాస్టల్ ఆడిటోరియంలో టీబీఎస్‌ఎస్ సర్వసభ్య సమావేశం జరిగింది. సంస్థ కార్యకలాపాలు, నిబంధనలు, నియమావళి, జమఖర్చులపై సుదీర్ఘంగా చర్చించి చేపట్టాల్సిన కార్యక్రమాలపై తీర్మానం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందన్నారు. సంస్థ తరపున సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ సలహాదారులు కె. వెంకట్రావు, అచ్యుతరావు, దేశ్ పాండే రుక్మిణి శ్రీనివాసా చార్యులు, ప్రసూన జోషి, రాజమోహన్, అమర్‌నాథ శర్మ, మురళీ రామారావు, సత్యం శాస్త్రి, అమిత్ దేశ్ పాండ్యే, వేణుగోపాల్ రావు, వేణుగోపాల శర్మ, సౌజన్య దేశ్‌పాండ్యే, బి.లక్ష్మి, కవిత రఘురామా రావు, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

'ఓ దళిత కమ్యూనిస్టు జ్ఞాపకాలు' పుస్తకావిష్కరణ



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సీనియర్ జర్నలిస్టు, ఎస్‌వీకే కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్ అనువదించిన 'ఓ దళిత కమ్యూనిస్టు జ్ఞాపకాలు' పుస్తకాన్ని సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ప్రముఖ రచయిత విజయభారతీ ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ చైర్మన్ మల్లెపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సహచరుడైన సత్యంద్రమోరే జీవిత చరిత్రకు సంబంధించిన పుస్తకాన్ని తెలుగులోకి అనువదించడం అభినందనీయమన్నారు. ఇలాంటి స్ఫూర్తిదాయకమైన పుస్తకాలు సమాజానికి ఎంతో అవసరమన్నారు. కె.ఆనందచారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అతిథులుగా టీపీఎస్‌కే ప్రతినిధి రాములు, ఆర్.వాసు తదితరులు పాల్గొన్నారు.

నాలా ప్రహరీ పనుల పర్యవేక్షణ

చిక్కడపల్లి: హుస్సేన్‌సాగర్ నాలా రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. సోమవారం సబర్మతినగర్‌లో జరుగుతున్న నాలా ప్రహరీ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో వర్షం వచ్చిన నాలాలో వరదనీరు పెరిగిన నాలా పరివాహక బస్తీ ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించామన్నారు. బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకులు ముఠాజైసింహ, డివిజన్ అధ్యక్షులు రాకేష్‌కుమార్, ముఠానరేష్, శ్రీనివాస్‌గుప్తా, జీవైగిరి, నర్సింగ్‌ముదిరాజ్, ఎండీగౌస్, శ్రీధర్‌రెడ్డి, ఆనంద్, చందు, చాణిక్యరెడ్డి తదితరులున్నారు.



నాలా ప్రహరీ నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిత్తశుద్ధి పాలనకు కేసీఆర్ నిదర్శనం

అంబర్‌పేట: తెలంగాణ ఏర్పడితే అందకారం అవుతుందని అవహేళన చేసిన వారికి సీఎం కేసీఆర్ విద్యుత్ సంస్కరణలు చేపట్టి చరిత్ర తిరగ రాశారని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం అంబర్‌పేటలోని క్రౌన్ ఫంక్షన్‌హాల్‌లో చేపట్టిన విద్యుత్‌శాఖ అధికారుల సత్కార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జాతీయ పతాకాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్‌లు విజయ్‌కుమార్‌గౌడ్, దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్‌లతో కలిసి జాతీయజెండా ఆవిష్కరించారు. అనంతరం ఒడిశాలో రైలు ప్రమాదంలో మృతులకు రెండు నిమిషాలు నివాళులర్పించారు. మంత్రి తలసాని మాట్లాడుతూ.. చిత్తశుద్ధి ఉన్న పాలకులు ఉంటే ఏ రాష్ట్రమైనా, దేశమైనా అభివృద్ధి చెందుతుందన్నారు. తెలంగాణ ఆవిర్భావ సమయంలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉండేదని దానిని అధిగమించేందుకు విద్యుత్ ఉద్యోగులను భాగస్వాములను చేసి సీఎం కేసీఆర్ చేపట్టిన సాహసోపేత నిర్ణయాలతో విద్యుత్ సమస్య లేని రాష్ట్రంగా తెలంగాణ అవతరించిందన్నారు.

- నేడు తెలంగాణలో నిరంతర విద్యుత్‌తో వ్యవసాయం, పారిశ్రామిక రంగం అభివృద్ధి చెందిందన్నారు. ఆర్‌డీఓ వెంకటేశ్వర్లు, విద్యుత్ ట్రాన్స్‌కో సీజీఎం నర్సింహస్వామి, ఎస్‌ఈ.బ్రహ్మం, కమల్‌కుమార్, ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న మంత్రి తలసాని, ఎమ్మెల్యే కార్పొరేటర్లు

కలకలం రేపిన మరో బీఆర్‌ఎస్ వర్గం...

విద్యుత్‌శాఖ సాధించిన ఫలితాలను విద్యుత్ అధికారి కార్యక్రమంలో ప్రసంగిస్తుండగా.. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ఓ వర్గం నేతలు అకస్మాత్తుగా వేదికపైకి వెళ్లారు. బీఆర్‌ఎస్ అంబర్‌పేట నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డి, కార్పొరేటర్ పులి జగన్, సీనియర్ నాయకులు గరిగంటి రమేష్ తదితరులు జై తెలంగాణ నినాదాలు చేస్తూ.. వేదికపై ఉన్న విద్యుత్ ఉద్యోగులను పిలిచి సత్కార కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యుత్ ఉద్యోగులకు శాలువాలు కప్పి అభినందించారు. అనంతరం ఎడ్ల సుధాకర్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలంటూ ఆయన అనుచరులు నినాదాలు చేస్తూ వెళ్లిపోయారు. పోటీగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ ఆయన అనుచరులు నినాదాలు చేస్తుండటంతో ఎమ్మెల్యే వారిని వారించినట్లు సమాచారం.